సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం, 22, ఫిబ్రవరి, 2023



కొత్త పంచాయతీలకు భవనాలు

కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించి నిధులు మంజూరు చేసింది. - 9లో



ఇక్కత్ చేనేత ప్రదర్శన

ఆస్ట్రేలియాలో జరిగిన ఓ వేడుకలో తెలంగాణ చేనేత వస్త్రాలతో పాటు ఇక్కత్ చీర నేసే సాంకేతికతను ప్రదర్శించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
37° / 17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీదారులకు ఆసరా పింఛన్లు మంజూరు

భువనగిరిటౌన్ : ప్రజావాణి అర్జీదారులకు ఆసరా పింఛన్లు మంజూరైనట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మందడి ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య పింఛన్ పొందుతూ చనిపోయిన వారి భార్యలు వివిధ సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌కు చేసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ మండలాల్లో మంజూరైన 345 పింఛన్లు వచ్చే మార్చి నెల నుంచి నగదు రూపంలో తీసుకోవచ్చని తెలిపారు. లబ్ధిదారుల జాబితా మండల అభివృద్ధి అధికారుల ద్వారా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పంపించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా వృద్ధాప్య పెన్షన్ పొందుతూ చనిపోయి ఉంటే వారు సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా మండల అభివృద్ధి అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న పీవీ శ్యాంసుందర్‌రావు

యాదగిరిగుట్ట: రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని 145, 146, 148 బూత్‌ల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని వివరించారు. కానీ, రాష్ట్రంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆటో కార్మికులను రోడ్డున పడేశారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్, ఆలేరు పాలక్ భిక్షపతి, రాఘవుల నరేందర్, చిరిగే శ్రీనివాస్, రచ్చ శ్రీనివాస్, జంపాల శ్రీనివాస్, సప్పిడి సత్తిరెడ్డి, కాదునూరి నవీన్‌కుమార్, లెంకలపల్లి శ్రీనివాస్, బొమ్మగాని రాజమణి, తాళ్ల భాస్కర్ రెడ్డి, మందోజు నరేష్, ఉమ, రంగ రేఖ, మెరుగు శ్రీకాంత్ తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరిటౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన వివిధ స్థాయీ సంఘాల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో డాక్టర్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్ మాట్లాడుతూ ఆలేరులో మదర్ అండ్ హెల్త్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నాటికి వసతులు సమకూర్చాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఆర్ అండ్‌బీ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఇరిగేషన్, మిషన్ భగీరథ, వైద్యారోగ్యం ,పంచాయతీ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పథకాల పురోగతిపై సమీక్షించారు. ఈ శాఖలకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ బి.శ్రీనివాస్‌రావు, జెడ్పీటీసీలు వెంకట్‌రెడ్డి, నరేందర్‌గుప్త, శ్రీరాముల జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిత్యావసర పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ప్రజలపై భారాన్ని మోపుతుందని విమర్శించారు. సమావేశంలో నర్సింహ, బాలరాజు, మల్లేశం, పెంటయ్య, స్వామి, కృష్ణ, వెంకటేష్, జహంగీర్, ముత్యాలు, అనిల్, మధు, యాదయ్య పాల్గొన్నారు.

● నృసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



యాదాద్రి ప్రధానాలయం ముఖమండపంలో శ్రీలక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు



పాదుకల్లో పోసిన పుట్ట మట్టి, నవధాన్యాలకు పూజలు చేస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి, ఈఓ గీతారెడ్డి తదితరులు

ఆస్పత్రుల్లో వైద్యులేరీ..?

- మొక్కుబడిగా సర్కారు వైద్యం
- మెజార్టీ ఆస్పత్రుల్లో పోస్టులు ఖాళీ
- భర్తీకి చర్యలు చేపట్టని పాలకులు
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా చితికిపోతున్న పేదలు



భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులు

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. మెజార్టీ పోస్టులు ఖాళీగా ఉండడంతో పేదలకు వైద్యసేవలు అందడం లేదు. దీంతో జిల్లాలో సర్కారు వైద్యం మొక్కుబడిగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సకాలంలో వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయి. పేదలు ప్రైవేట్ వైద్యం కోసం పరుగులు తీసి ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలోని నాలుగు ప్రధాన ఆస్పత్రుల్లో 281బెడ్‌లు ఉన్నా 104మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా సరిగ్గా సగం మంది మాత్రమే ఉన్నారు. వీరిలో 8 మంది డాక్టర్లు కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. ప్రభుత్వం డాక్టర్లను భర్తీ చేయకపోవడం, ఉన్న వారు డిప్యుటేషన్‌పై వెళ్లడం, కొందరు చెప్పాపెట్టకుండా విధులకు గైర్హాజరు అవుతున్నారు.

అస్పత్రుల వారీగా డాక్టర్ల సంఖ్య ఇలా..

భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి	
ఉండాల్సిన డాక్టర్లు	50
పనిచేస్తున్న డాక్టర్లు	32
రెగ్యులర్ డాక్టరు	24
కాంట్రాక్టు డాక్టర్లు	08
రామన్నపేటకు డిప్యుటేషన్	04
చౌటుప్పల్ డిప్యుటేషన్	04
ఆలేరు డిప్యుటేషన్	01

రామన్నపేట ఏరియా ఆస్పత్రి	
ఉండాల్సిన డాక్టర్లు	22
పనిచేస్తున్న డాక్టర్లు	04
చౌటుప్పల్ సీహెచ్‌సీలో..	
ఉండాల్సిన డాక్టర్లు	16
పనిచేస్తున్న డాక్టర్లు	02
ఆలేరు సీహెచ్‌సీలో..	
ఉండాల్సిన డాక్టర్లు	16
పనిచేస్తున్న డాక్టర్లు	05
గైర్హాజరైన డాక్టర్లు	03

అంతంత మాత్రంగానే..

భువనగిరి జిల్లా కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి, చౌటుప్పల్, రామన్నపేట ఏరియా ఆస్పత్రి, చౌటుప్పల్, ఆలేరు సీహెచ్‌సీలో డాక్టర్ల కొరతతో రోగులకు వైద్యం అంతంత మాత్రంగానే అందుతోంది. భువనగిరి కేంద్ర ఆస్పత్రిలో ఉన్న డాక్టర్లను జిల్లాలోని మిగతా ఆస్పత్రులకు డిప్యుటేషన్‌పై పంపించగా, ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు డాక్టర్లు విధులకు గైర్హాజరు అవుతున్నారు. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యుల ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తుండడంతో ప్రభుత్వ వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇంకా 100 పడకల ఆస్పత్రిగానే..

జిల్లా కేంద్ర ఆస్పత్రి స్థాయిని పెంచలేదు. ఇంకా 100 పడకల ఆస్పత్రిగానే కొనసాగుతోంది. 250 పడకల జిల్లా ఆస్పత్రిగా మార్చడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆస్పత్రిస్థాయి పెరగకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పెండింగ్‌లో ఉన్నాయి. ఆస్పత్రి ఆధునీకరణ జరుగడంలేదు. కేటాయించిన పోస్టులకు అనుగుణంగా భర్తీ చేయకపోవడంతో ఆస్పత్రిలో వైద్యం ఎండమావిగానే మారింది. ప్రధానంగా స్త్రీ ప్రసూతి, గైనాకాలజీ, రేడియాలజీ, పెథాలజీ,చర్మ, మానసిక వ్యాధుల డా క్టర్లు లేరు. ఉన్న వారిలో 9 మందిని డిప్యుటేషన్ మీ ద రామన్నపేట, చౌటుప్పల్, ఆలేరు ఆస్పత్రులకు పంపించారు.

హైదరాబాద్‌కు పరుగులు

చౌటుప్పల్ సీహెచ్‌సీలో 16మంది వైద్యులు ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఇక్కడ కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు ఆసుపత్రి సూపరింటెండెంట్ కాగా మరొక పిల్లల వైద్యుడు. ఇంకొకరు జనరల్ వైద్యుడు ఉన్నారు. మిగిలిన 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి .అత్యంత అవసరమైన స్త్రీల వైద్య నిపుణులు, అనస్తీసియా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దంత, జనరల్, ఎముకల, జనరల్ మెడిసిన్, రేడియాలజిస్ట్ వంటి పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. అనస్తీసియా లేని కారణంగా ఇటీవల కొద్ది రోజులు ఆపరేషన్లు కూడా నిర్వహించలేదని వైద్యులు చేతులెత్తేస్తున్నారు. దీంతో హైదరాబాద్‌కు రోగులు పరుగులుతీస్తున్నారు.

ఆలేరు సీహెచ్‌సీలో ఆపరేషన్లు లేవు

ఆలేరు సీహెచ్‌సీలో 16 మంది వైద్యులకు ఐదుగురే ఉన్నారు. ముగ్గురు డాక్టర్లు విధులకు హాజరు కావడంలేదు. ఇద్దరు జనరల్ సర్జన్లకు ఒక్కరే ఉన్నారు. దీంతో ఆపరేషన్లు దాదాపు కావడం లేదు. అనస్తీషియా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చిన్నపిల్లల డాక్టర్ ఒక్కరే డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. డిప్యూటీ సివిల్‌సర్జన్ పోస్టులు నాలుగు ఖాళీగా ఉన్నాయి. గైనకాలజీ ఒక్క డాక్టరే ఉన్నారు. జనరల్ ఫిజిషియన్, రేడియాలజీ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులకు ప్రభుత్వ వైద్యం అందడంలేదు.

23 పోస్టులకు ముగ్గురే..

రామన్నపేట ఏరియా ఆస్పత్రి చిట్యాల, వలిగొండ, మోత్కూరు, రామన్నపేట, వలిగొండ, నార్కట్‌పల్లి తదితర మండలాలకు వైద్య సేవలు అందిస్తుంది. ఆసుపత్రిలో 23 డాక్టర్ పోస్టులు ఉండగా ప్రస్తుతం ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. వారిలో సూపరిండెంట్ తోపాటు మరొకరు చిన్నపిల్లల స్పెషలిస్టులు కాగా మరొకరు జనరల్ డ్యూటీ డాక్టర్. సోమ, బుధ, శుక్రవారాల్లో చౌటుప్పల్‌కు చెందిన గైనకాలజిస్ట్ డిప్యుటేషన్‌పై వస్తుంది. ఆయా రోజుల్లో మాత్రమే గర్భిణులకు వైద్యసేవలు అందుతుంటాయి. అదికూడా ఓపీ టైం వరకు మాత్రమే. అత్యవసర కాన్పుల కోసం నల్లగొండ, హైదరాబాద్ ప్రాంతాలకు లేదా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లవలసి వస్తుంది.

డాక్టర్లను నియమించాలి



భువనగిరి ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు లేరు. వైద్యం కోసం వచ్చే పేదలకు ఇక్కడ వైద్యం పూర్తి స్థాయిలో అందించాలి. డాక్టర్లను నియమించకపోవడం వల్ల ప్రైవేట్‌కు చాలా మంది వెళ్తున్నారు. వచ్చిన వారు ఉన్న డాక్టర్లతోనే వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి డాక్టర్లను నియమించాలి.

– ఆంజనేయులు, చౌదరిపల్లి, బొమ్మలరామారం

అఖండ జ్యోతి రథయాత్ర ప్రారంభం



పూజలు చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి : శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 29వ అఖండ జ్యోతి రథయాత్ర మంగళవారం పట్టణంలోని వివేరా హోటల్ నుంచి తిరిగి ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేష్‌చంద్రలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథయాత్రతో పాటు కొద్ది దూరం వరకు వెళ్లారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, అఖండ జ్యోతి రథయాత్ర చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, హోటల్ వివేరా మేనేజింగ్ డైరెక్టర్ సద్ది రాఘవేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, బండారు శ్రీనివాస్‌రావు, మందడి వెంకట్‌రెడ్డి, దిడ్డి బాలాజీ పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకుని..

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆచార్యులు ఆమెకు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మృత్యంగ్రహణము పూజలో పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ

భువనగిరిటౌన్ : మోడల్ స్కూళ్లలో అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ అధికారులు, ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం కాన్ఫరెన్స్ హాలులో ఆయన విద్యా శాఖ సెక్యూరిటీ అధికారి అండాలు, ఆర్ అండ్‌బీ ఇంజనీర్లు, మండల అభివృద్ధి విద్యాధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా మోడల్ స్కూళ్లలో చేపట్టిన పనులను సమీక్షించారు. మండల విద్యాధికారులు మోడల్ స్కూళ్ల ప్రారంభానికి ప్రోటోకాల్ ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న తరగతి గదులను కూల్చి వేసి చదును చేయాలని సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులపై కొరడా!

- వాహనాల పన్నుల వసూళ్లకు రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్
- రోడ్డు ట్యాక్స్ చెల్లించకుండా పట్టుబడితే భారీగా జరిమానా
- జిల్లా వ్యాప్తంగా పన్ను చెల్లించని వాహనాలు 6,859



భువనగిరి : వాహనాల తనిఖీలో పన్నులు వసూలు చేస్తున్న డీటీఓ సురేందర్‌రెడ్డి (ఫైల్)

భువనగిరి : రోడ్డు ట్యాక్స్ చెల్లించని వాహనదారులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరడంతో లక్ష్యాన్ని చేరుకోవడానికి తనిఖీల పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న పన్నుల లక్ష్యం సాధించడానికి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. కరోనా కారణంగా రెండేళ్లుగా పన్నులు చెల్లించడంలో వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం ఈ ఏడాది సకాలంలో వసూలు చేయాలని నిర్ణయించింది.

పన్నులు చెల్లించని వాహనాలు

కాంట్రాక్టు క్యారేజీ బస్సులు	05
మ్యాక్స్ క్యాబ్‌లు	74
ప్రైవేట్ సర్వీస్ వాహనాలు	07
గూడ్స్ క్యారెజేస్	3,511
ట్రాక్టర్ ట్రాయలర్స్	2,466
ఇతర వాహనాలు	796
మొత్తం	6,859

పన్నుల వసూలుకు ప్రత్యేక బృందాలు

జిల్లా వ్యాప్తంగా పన్ను చెల్లించకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాల పన్నులు వసూలు చేసేందుకు రవాణా శాఖ ప్రత్యేక అధికారుల బృందాలను నియమించింది. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలో పాటు చౌటుప్పల్, మోత్కూర్, రామన్నపేట, ఆలేరు, యాదగిరిగుట్ట, ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ట్యాక్స్ చెల్లించకుండా తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు ట్యాక్స్‌పై 200శాతం మేర జరిమానా విధిస్తున్నారు.

వాహనదారులు సహకరించాలి

పన్ను చెల్లించకుండా రోడ్లపై వాహనాలు తిరుగుతున్నాయి. ఆయా వాహనాల యాజమానులు సకాలంలో పన్నులు చెల్లించాలి. లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. నిర్లక్ష్యంతో పన్నులు చెల్లించకుండా తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం మేరకు జరిమానా వేసి పన్నులతో పాటు వసూలు చేస్తున్నాం. పాత వాహనాల సమాచారం రవాణాశాఖ కార్యాయంలో చెప్పకుండా తుక్కు కింద విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకంటాం. వాటిపై పేరుకుపోయిన పన్నులు వసూలు చేస్తాం. జిల్లాలో వెంటనే పన్నులు చెల్లించి సహకరించాలి. లేదంటే వాహనాలను సీజ్ చేస్తాం.

– సురేందర్‌రెడ్డి, డీటీఓ

ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం

- జీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి

భువనగిరి : బస్వాపూర్ ప్రాజెక్టు ముంపు గ్రామైన బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లలో మౌలిక వసతులు కల్పించకపోతే ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని హుస్నేబాద్‌లోని భూ నిర్వాసితుల కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. 1,2,3,4,5 సెక్టార్‌లుగా ప్లాట్లను చేసి అభివృద్ధి చేయకుండా లాటరీ పద్ధతిలో కేటాయించి ఎమ్మెల్యే చేతులు దులుపుకునే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. భూ నిర్వాసితుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని చెప్పారు.



హుస్నేబాద్‌లో ప్లాట్లను పరిశీలిస్తున్న గూడూరు నారాయణరెడ్డి తదితరులు

కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు కుంభం స్పష్టీకరణ
- త్వరలో భువనగిరిలో పాదయాత్ర చేస్తానని వెల్లడి

సాక్షి, యాదాద్రి : కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు అధికార టీఆర్ఎస్ పార్టీ మైండ్ గేమ్ ఆడుతుందని విమర్శించారు. మంగళవారం భువనగిరి రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ గెలువబోతుందనే అధికార పార్టీ ఇలాంటి దుష్ప్రచారానికి తెరతీసిందని అన్నారు. భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయ్యాడన్నారు. ఎమ్మెల్యే వైఫల్యాలను ఒప్పుకుని రాజీనామా చేసి వస్తే జనంలో తేల్చుకుందామని సవాల్ చేశారు. రానున్న కాలంలో భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సింగన్నగూడెం వద్ద జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మించకపోవడంతో ప్రయాణికుల ప్రాణాలు పోతున్నాయన్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు మార్చారని ఆరోపించారు. బస్వాపూర్ ప్రాజెక్టు ముంపు బాధితులకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, పట్టణ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కోట పెద్దస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి మొదటి ప్రీ ఫైనల్

- పరీక్షలు రాయనున్న 8,997 మంది విద్యార్థులు



భువనగిరి : జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి పదో తరగతి విద్యార్థులకు మొదటి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో జిల్లా ప్రజాపరిషత్, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేట్, కేజీబీవీ, మోడల్, రెసిడెన్సియల్, గురుకుల పాఠశాలలు 199 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం పదో తరగతి విద్యార్థులు 8,997 మంది ఉన్నారు. గతంలో వార్షిక పరీక్షలకు ముందు ఒకే ప్రీ ఫైనల్ పరీక్ష ఉండేది. ప్రస్తుతం రెండు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. రెండో ప్రీ ఫైనల్ పరీక్షలో మార్చిలో జరగనుంది. వంద శాతం సిలబస్‌తో పరీక్షలు జరగనున్నాయి. కరోనాకు ముందు పదో తరగతి పరీక్షల్లో 11 ప్రశ్న పత్రాలుఉండేవి. ప్రస్తుతం వాటిని ఆరుకు తగ్గించడంతో పాటు ప్రశ్న పత్రాల్లో మార్పులు చేశారు. ఇప్పటికే జనవరి 1వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఒక్కో విద్యార్థికి రూ. 15లు కేటాయించి అల్పాహారం అందిస్తున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ నెల 28వ తేదీ వరకు జరగనున్నాయి.

క్లుప్తంగా

23న ఎంజీయూలో జాబ్‌మేళా

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ)లో 23వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి ఆపై చదివిన వారు, 2022 విద్యా సంవత్సరంలో పాస్ అవుట్ అయిన వారు కూడా ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అఖండజ్యోతికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లోని బర్కత్‌పూర్‌లో ఉన్న యాదగిరి భవన్ నుంచి ప్రారంభమైన అఖండ జ్యోతి యాత్ర మంగళవారం రాత్రి యాదగిరిగుట్ట పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలో అఖండ జ్యోతికి స్థానిక మహిళలు, భక్తులు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. పట్టణ శివారులోని వడాయిగూడెం, సురేంద్రపురి వద్ద ఆ గ్రామ సర్పంచ్ గుండు మనీష్‌గౌడ్, అఖండ జ్యోతి యాత్ర అధ్యక్షులు సద్ది వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండు ముత్తయ్యగౌడ్‌లు స్వాగతం పలికారు. కొండ కింద ఆలయాధికారులు, ఆచార్యులు స్వాగతం పలికారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బీబీనగర్: మండలంలోని పగిడిపల్లి సమీపంలో ఈ నెల 1వ తేదీన గుర్తుతెలియని రైలు కింద పడి గాయాలపాలైన సుమారు 50సంవత్సరాల వ్యక్తి హైదరాబాద్‌లోని గాంధీలో ఆస్పత్రి లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు జీఆర్‌పీ ఐఓ మునేశ్వర్‌రావు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



సైదులు(ఫైల్)

రామగిరి(నల్లగొండ): అప్పుల బాధతో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కేశరాజుపల్లి సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశరాజుపల్లికి చెందిన బొజ్జ సైదులు(35) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుతుండడంతో మంగళవారం రాత్రి కేశరాజుపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ పి. మునీశ్వర్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య జ్యోతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నృసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- ఆరేళ్ల తర్వాత ప్రధానాలయంలో ఉత్సవాలు
- విశ్వక్సేనారాధన, స్వస్తి వాచనం, పూజలు చేసిన ఆచార్యులు
- నేడు అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరి పూజ, దేవతాహ్వానం



అంకురార్పణ సామగ్రితో స్వయంభూ వద్ద పూజలు చేసేందుకు వెళ్తున్న అర్చకులు,అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం మంగళవారం ప్రధానాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 10గంటలకు ప్రధాన ఆలయంలోని స్వయంభూలకు పూజలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనారాధన, స్వస్తి వాచనం, రక్షాబంధనం, అంకురారోపణం వంటి పూజలు జరిపించారు. తొలి పూజలో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు. వారి వెంట ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం, పారాయణీకులు ఉన్నారు.

ఉదయం విశ్వక్సేనారాధనతో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 10గంటలకు గర్భాలయంలోకి స్వయంభూలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో ఉత్సవ మూర్తుల చెంత విశ్వక్సేనారాధతో ఉత్సవాలను ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు.



స్వామి అమ్మవార్ల విగ్రహాలకు సంప్రోక్షణ చేస్తున్న ప్రధాన అర్చకులు

స్వస్తి వాచనం..

వార్షిక బ్రహ్మోత్సవములు నిర్వహించే సమయంలో ఆగమ శాస్త్రానుసారం స్వస్తి వాచనంతో వైదిక కార్యక్రమాలు ప్రారంభించడం ఆనవాయితీ. సస్తి వాచన మంత్ర జలాన్ని గర్భాలయంలో, ఉప ఆలయాల్లో, ముఖ మండపంలో, ధ్వజ స్తంభానికి, ఆలయ తిరుమాఢ వీధుల్లో, ఆలయ పరిసరాల్లో,



ఈఓ గీతారెడ్డికి పట్టువస్త్రాలను అందజేస్తున్న పోచంపల్లి చేనేత కార్మికులు

భక్తులపై ప్రోక్షణ గావించారు.

రక్షాబంధనం..

విశ్వక్సేనారాధన, స్వస్తి వాచనం పూర్తయిన తర్వాత ఆచార్యులు రక్షాబంధనం పూజలు జరిపించారు. తొలుత గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా బంగారు కవచమూర్తులకు రక్షాబంధనం గావించారు. అనంతరం ఉప ఆలయాల్లోని ఆండాళ్ అమ్మవారికి, ఆళ్వారులకు, విశ్వక్సేనుడికి రక్షాబంధనం గావించి, ముఖ మండపంలోని ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేశారు. తర్వాత ఉత్సవ నిర్వాహకులు, భక్తులకు ఈ రక్షాబంధనం కట్టారు.

సాయంత్రం అంకురార్పణ..

సాయంత్రం నిత్యారాధనల అనంతరం మృత్సంగ్రహణం(పుట్ట మన్ను) సేకరించు వేడుకతో పాటు అంకురార్పణ వేడుకలను నిర్వహించారు. భూసూక్తముతో భూదేవిని అర్చించి మృత్తికను సేకరించి యాగశాలకు చేర్చారు. అనంతరం పుట్ట మన్నును మంత్ర జలములతో ప్రోక్షణ గావించి పాలికలో నవధాన్యాలు, పుట్ట మన్ను నింపి ఆరాధన గావించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి పోచంపల్లి పట్టువస్త్రాలు..

భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట: యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు బహూకరిస్తుంటారు. ఈ మేరకు మంగళవారం పోచంపల్లిలోని శ్రీమార్కండేశ్వర స్వామి దేవాలయంలో పట్టువస్త్రాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజనలు, కీర్తనలతో ప్రదర్శనగా యాదాద్రికి వెళ్లి ఈఓ గీతారెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తికి రెండు పట్టు చీరలు, పట్టు పంచెలు, రెండు శాలువాలను అందజేశారు. అదేవిధంగా మార్కండేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షుడు అంకం మురళి, మార్కండేయస్వామి ఆలయ చైర్మన్ బడుగు చండీకేశ్వర్, నాయకులు తడక వెంకటేశం, తడక రమేశ్, భోగ నర్సింహ, బాలరత్నం, గంజి అంజయ్య, వనం మల్లేశ్, కర్నాటి అంజమ్మ, గుండు పాండు, కర్నాటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం, హవనం వంటి పూజలు జరిపిస్తారు.

యాదాద్రీశుడికి బంగారు ఆభరణాలు బహూకరణ



ఆలయ ఈఓ గీతారెడ్డికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లకు మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లకు చెందిన సత్తూరు సుందరమ్మ కుటుంబ సభ్యులు రూ.22లక్షల విలువైన బంగారు ఆభరణాలను బహూకరించారు. ఆండాళ్ అమ్మవారికి రంగనాయక హారం, లక్ష్మీదేవికి దశావతార హారంతో పాటు స్వామి వారికి డైమండ్ పచ్చల హారాన్ని తయారు చేయించి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తిలకు అందజేశారు.



ప్రధానాలయంలో భక్తుల రద్దీ

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లను వినియోగించుకోవాలి



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

భువనగిరి : విద్యార్థులు సైన్స్ టాలెంట్ టెస్ట్‌లను వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ పరిపాలనాధికారి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఈ టెస్ట్‌లతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీచ్ మహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఫ్‌పీఎస్‌టీ (ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని వెలికి తీసేందుకు ఎఫ్‌పీఎస్‌టీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 27మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఇందులో సంజయ్ కుమార్, 8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్ రాజాపేట, హర్షవర్ధన్ జెడ్పీహెచ్‌ఎస్ నారాయణపూర్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు బుస్సా రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్లు శ్రీనివాస్, జోసెఫ్, ఏసీజీఈ కృష్ణారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్, రాజశేఖర్, హరినాథ్‌రెడ్డి, డీఎస్‌ఓ భరణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్



మాట్లాడుతున్న బీర్ల అయిలయ్య

తుర్కపల్లి : సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మోతీరాంతండా, గోగులగుట్టతండా, రామోజీనాయక్‌తండా, దేవోజీనాయక్‌తండా, గొల్లగూడెం, ధర్మారం గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్రంలోని పేదలందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీలిచ్చిన సీఎం కేసీఆర్ తూతూ మంత్రంగా అక్కడో గ్రామంలో ఇక్కడో గ్రామంలో ఇచ్చి ప్రజలను మోసం చేశారని, ఎన్నికలు వస్తున్నాయని ఇప్పుడు ఖాళీ స్థలాలు ఉన్నవారికి ఇళ్లు కట్టుకోవడానికి డబ్బులు ఇస్తామని మోసం చేస్తున్నారని అన్నారు. పంటలకు 24గంటల విద్యుత్ అని ప్రచారం చేసి ఇప్పుడు కనీసం 8గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్య, వైద్యం ఉచితంగా అందజేస్తామని, ప్రతి ఎకరాకు రూ.15వేల రైతు బంధు అందజేస్తామని, మహిళలకు డ్వాక్రా రుణాలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, సర్పంచ్ బిచ్చు నాయక్, ఎంపీటీసీ కానుగంటి శ్రీనివాస్, మోహన్‌బాబునాయక్, ప్రతిభారాజేశ్‌నాయక్, మహిళా అధ్యక్షురాలు చైత్యనమహేందర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, శేఖర్, వినోద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపులో బ్యాంకులకు దీటుగా తపాలా శాఖ

- భువనగిరి తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ భూమయ్య



రాజాపేట : మాట్లాడుతున్న సూపరింటెండెంట్ భూమయ్య

రాజాపేట : పొదుపులో బ్యాంకులకు దీటుగా తపాలా శాఖ పనిచేస్తుందని భువనగిరి తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ భూమయ్య అన్నారు. పోస్టాఫీసులో సేవింగ్స్ అకౌంట్స్ తెరిచే లక్ష్యంగా మంగళవారం మండలంలోని రఘునాథపురం పోస్టాఫీస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు ఖాతాలు బ్యాంకుల కంటే పోస్టాఫీసులో ఎక్కువగా ఉన్నాయని తెలియజేశారు. ఏదేని జాతీయ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులకంటే తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొదుపు ఖాతాల్లో వడ్డీ అధికంగా వస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా పోస్టాఫీసుకు వెళ్లకుండానే ఇంటి వద్దనే ఆన్ లైన్ సమాచారంతో పోస్టల్ ఖాతాలను తెరిచేందుకు అవకాశం ఉందన్నారు. పోస్టల్ ఖాతా పొందాలనుకునే వారు ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఇన్ఫో యాప్ డౌన్లోడ్ చేసుకుని, చిరునామా తదితర వివరాలతో సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేసుకోవాలి అని సూచించారు. దాని ఆధారంగా సంబంధిత పోస్టాఫీసు నుంచి పోస్టుమెన్ ఇంటివద్దకు వచ్చి ఖాతా తెరిచేందుకు అవసరమైన పత్రాలను పూరించేందుకు సహకరిస్తారన్నారు. జిల్లాలో 10 వేల పొదుపు ఖాతాలు ఉన్నాయని, ఫిబ్రవరి 20 నుంచి 25 వరకు మరో 5 వేల పొదుపు ఖాతాలను తెరిచే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని అన్నారు. సమావేశంలో సబ్ పోస్టు మాస్టర్ బాలనరేష్, బిపిఎంలు గంజి మురళి, బి.నవ్య, కె చంద్రశేఖర్, వి.శ్రీనివాస్ గౌడ్, మదూరి బాలసిద్దులు, స్వాతి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం

మోత్కూరు : తపాలా శాఖ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యమని నల్లగొండ నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రవి అన్నారు. మంగళవారం మండలంలోని తపాలా కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి ఆయన మాట్లాడారు. తపాలా శాఖ వారు ఈనెల 20 నుంచి 24వరకు దేశ వ్యాప్తంగా పొదుపు ఖాతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో వివిధ రకాల ఖాతాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు పోస్టల్ శాఖ నడుం బిగించిందని, అందులో భాగంగా ప్రజలు తపాలా శాఖకు చెందిన వివిధ పథకాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ప్రజలు పోస్టాఫీసుకు రాకుండానే వారి ఇంటి వద్దనే ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ ఖాతా కొరకు నమోదు చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఈ సేవలకు పోస్టల్ శాఖ వారు ఎలాంటి అదనపు రుసుం తీసుకోరని అన్నారు. పోస్టాఫీస్ సేవింగ్ అకౌంట్ కలిగి ఉన్న ఖాతాదారులు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్ రికరింగ్ డిపాజిట్, టైం డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18002666868ను సంప్రదించాలని కోరారు.

లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్: లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం .. మిర్యాలగూడ పట్టణంలోని చర్చి బజార్‌కు చెందిన విజయ్(35) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా విజయ్ మద్యానికి బానిసై మారి ఇంటి వద్దనే ఉంటున్నాడు. మంగళవారం నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్ రోడ్డు దాటుతుండగా లారీ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా విజయ్ లారీ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని లారీ డ్రైవర్ చెబుతుండగా.. రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ కింద పడి మృతి చెందాడని మృతుడి అన్న రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

‘గుట్ట’లో బస్టాండ్‌ను కొనసాగించాలి

- అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను తొలగించకుండా యథావిధిగా కొనసాగించాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బస్టాండ్‌ను ఆధారంగా చేసుకొని వందలాది కుటుంబాలు బతుకుతున్నాయని తెలిపారు. ప్రధానాలయం ప్రారంభం అయిన నాటి నుంచి కొండపైకి ఆటోలను అనుమతించకపోవడంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కొండపైకి ఆటోలను అనుమతించాలన్నారు. పాత హైస్కూల్ మైదానంలో క్షేత్రానికి వచ్చి బస చేసే భక్తుల కోసం 1000 గదులను నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రీశుడి ఆలయానికి ఐఏఎస్ అధికారిని ఈఓగా నియమించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అఖిల పక్షాల నాయకులు కళ్లెం కృష్ణ, కాటబత్తిని ఆంజనేయులు, మంద శంకర్, మంగ నర్సింహులు, బబ్బూరి శ్రీధర్, కౌన్సిలర్ దండబోయిన అనిల్, పేరబోయిన పెంటయ్య, బెలిదె అశోక్, కలకుంట్ల శేఖర్, బండి జంగమ్మ, దీకొండ జోగయ్య, పేరబోయిన మహేందర్, బొజ్జ సాంబేష్, బండి అనిల్, గడ్డమీది దేవేందర్, మన్సూరుపాష బిట్టు హరీష్, నర్సింహ, శ్రీరాం తదితరులున్నారు.

పురుగు మందు తాగి యువకుడి బలవన్మరణం

కేతేపల్లి: పురుగు మందు తాగి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్కుపల్లి గ్రామానికి చెందిన కుంచం శివప్రసాద్(28) తన సొంత కారును కిరాయిలకు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మంగళవారం చెర్కుపల్లి నుంచి భీమారం గ్రామానికి వెళ్లిన శివప్రసాద్ తిరిగి ఇంటికి వస్తూ భీమారం గ్రామ శివారులో దారి వెంట పురుగు మందు తాగాడు. అనంతరం శివప్రసాద్ తన సోదరుడికి ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగిన విషయాన్ని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూసేసరికి శివప్రసాద్ విగత జీవిగా పడి ఉన్నాడు. శివప్రసాద్ ఆత్మహత్య చేసుకోవటానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేతేపల్లి ఎస్‌ఐ ఎం. అనిల్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దేవరకొండ: పట్టణ శివారులోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటాయని, బూడిద రంగు ప్యాంట్, నారింజ రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440795604 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనివాస్ సూచించారు.

పుస్తెలతాడు అపహరణ

మద్దిరాల: గుర్తుతెలియని వ్యక్తులు మహిళకు మాయమాటలు చెప్పి పుస్తెలతాడు అపహరించిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన యరుకలి రాధిక, సైదులు దంపతులు స్థానికంగా కిరాణ షాపు నడిపిస్తున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి గుర్తుతెలియని మహిళ, వ్యక్తి కిరాణ సామాను కోసం షాపు వద్దకు వస్తూ పక్కనే డ్రిల్లింగ్ పనులు చేస్తున్నామని వారితో పరిచయం పెంచుకున్నారు. మంగళవారం మరోసారి షాపు వద్దకు వచ్చిన సదరు మహిళ, వ్యక్తి యాదగిరిగుట్టలో డ్రిల్లింగ్ చేస్తుండగా తమకు బంగారం ముద్ద దొరికిందని, దానిని అమ్మి పెట్టాలని రాధిక, సైదులు దంపతులకు చెప్పారు. దీంతో సైదులు ఆ బంగారం ముద్దను చెక్ చేయిస్తానని స్థానిక జ్యూయలరీ షాపు వద్దకు తీసుకెళ్లాడు. అదే సమయంలో షాపు వద్ద ఉన్న రాధికతో ‘మేము అంత బంగారం ముద్ద ఇచ్చాము కదా.. నీ భర్త వచ్చే వరకు గ్యారంటీ కొరకు నీ మెడలోని బంగారపు పుస్తెలతాడు ఇవ్వమని’ నమ్మించి 4.5 తులాల పుస్తెలతాడును తీసుకుని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్న తెలిపారు. గ్రామాలల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు.

ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడడంతో క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందగా, డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లాలోని నర్సాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడిపల్లిగూడేనికి ధాన్యం లోడు వెళ్తున్న లారీ తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ కాలనీ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన లారీ క్లీనర్ శివ అక్కడికక్కడే మృతిచెందగా, కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన డ్రైవర్ జానీకి తీవ్రగాయాలయ్యాయి.

నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

- 28 వరకు కొనసాగనున్న కార్యక్రమం
- 122 మందితో 50 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- జిల్లాలో 7లక్షల గొర్రెలు, మేకలు



నట్టల నివారణ మందులు వేస్తున్న పశు వైద్యసిబ్బంది (ఫైల్)

భువనగిరిటౌన్ : మూగ జీవాల సంరక్షణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ప్రతి సంవత్సరం వేసవిలో మూగ జీవాలకు వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని 6లక్షల గొర్రెలు, లక్ష మేకలకు నట్టల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

50 బృందాలు ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా 74 పశు వైద్యశాలలు ఉండగా ఇప్పటికే ఆయా కేంద్రాలకు నట్టల నివారణ డోసులు చేరుకున్నాయి. ఆయా పశు వైద్యశాలలు పరిధిలోని గ్రామాల్లో గల గొర్రెలు, మేకలకు ఈ టీకాలు పంపిణీ చేసేందుకు 122మంది సిబ్బందితో 50 బృందాలను ఏర్పాటు చేశారు. బృందాలు గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తూ బుధవారం నుంచి ఏడు రోజుల పాటు మేకలు, గొర్రెలకు టీకాలు వేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో బుధవారం నుంచి ఏడు రోజుల పాటు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. గొర్రెలు మేకలు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రత్యేక బృందాలు అన్ని గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తాయి. అధికారులకు రైతులు, కాపరులు సహకరించాలి.

– డాక్టర్ కృష్ణ, పశు సంవర్ధక శాఖ, జిల్లా అధికారి